శుక్రవారం 6, డిసెంబర్ 2024
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**14 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు**

జలవనరుల మంత్రి నిమ్మల

6

# కృత్రిమ మేధలో తొలి అడుగు





- ఏపీ ప్రభుత్వంతో గూగుల్ సంస్థ కీలక ఒప్పందం
- అంతర్జాతీయస్థాయి అవకాశాలకు యువతకు నైపుణ్య శిక్షణ
- స్టార్టప్‌లు, పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, హెల్త్‌కేర్‌లో సేవలు
- ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణలకు సహకారం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ

3

## ధాన్యం కొనుగోలులో.. ఏ రైతూ ఇబ్బంది పడకూడదు

- ఏ రైసుమిల్లులో అయినా అమ్ముకునే సౌలభ్యం కల్పించాం
- లోడింగ్‌లో జాప్యం ఉండొద్దు.. వాహనాలకు జీపీఎస్ ఉండాలి
- సంచుల కొరత రానివ్వొద్దు.. వాట్సాప్ సేవలూ సరిచూసుకోవాలి
- ఐవీఆర్ఎస్ ద్వారా రైతుల నుంచి సమాచారం తీసుకుంటున్నాం
- ఎక్కడైనా సమస్య ఉంటే స్వయంగా వస్తా.. వివరణ కోరతా
- నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు
- ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు చెల్లింపులు
- గతేడాది ఈ సమయానికి 5.22 లక్షల మెట్రిక్ టన్నులే సేకరణ
- బియ్యం అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు
- కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

2



మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం కొలువుదీరింది. భాజపా అగ్రనేత దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమానికి హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు.



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న డీప్‌టెక్ కాన్‌క్లేవ్ 2024 విశాఖపట్నంలో శుక్రవారం మొదలవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల గ్లోబల్ కాంక్లేవ్‌ను ప్రారంభిస్తారు. అందులో భాగంగా గురువారం రాత్రే విశాఖపట్నం చేరుకున్న సీఎం చంద్రబాబుకు సాదర స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు, ప్రతినిధులు, అధికార్లు.

4

## శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ కుట్ర

మాజీమంత్రి యనమల ఆగ్రహం 5



## జేబుదొంగ కాదు, గజదొంగ!

- ఎమ్మెల్యే జగన్‌పై ఏపీఎస్‌డీపీ చైర్మన్ ఆనం విసుర్లు
- ఎవరైనా రూ.2 వేల కోట్ల ఆస్తిని రూ.12 కోట్లకు అమ్ముతారా?
- రూ.2,689 కోట్ల షేర్ విలువను రూ.494 కోట్లకే ఇచ్చేస్తారా?
- జగన్, విజయసాయి ఇళ్లు అలా అమ్ముతారా..?
- అమ్మితే.. కొనడానికి నేను రెడీ
- గన్నుపెట్టి బెదిరించి లాక్కుంటేనే అలా జరిగింది..
- గొంతుమీద కత్తిపెట్టి సీ పోర్టులో వాటా కొట్టేశారు
- రూ.494 కోట్లకే 41శాతం వాటా కొట్టేయడం మాఫియా పనే?

6

## కియా పనితీరు భేష్

మంత్రి వాసంశెట్టి సుభాష్ కితాబు 5

తొలిసారి మంత్రి హోదాలో పరిశ్రమ సందర్శన

కియా అభివృద్ధికి సహకరిస్తాం: మంత్రి సవితమ్మ



## వచ్చే ఆర్నెల్లకు విద్యుత్ ప్రణాళిక



- శాఖాపరమైన అంశాలపై చర్చించిన మంత్రి గొట్టిపాటి
- విద్యుత్ కొనుగోలుపైనా అధికారులతో విస్తృత చర్చలు
- ప్రజలపై భారం పడకుండా చూడాలని ఆదేశం 5
- విద్యుత్ డిమాండ్, సప్లయి అంచనాలపై మంత్రి దిశానిర్దేశం

## స్థలం కబ్జాకోరుకు సీఐ శ్రీరామ్ అండదండలు

- ప్రశ్నించిన బాధితులకు బెదిరింపులు
- ప్రజావినతుల్లో హోంమంత్రి అనితకు ఫిర్యాదు
- వైసీపీ మూకల అరాచకాలపై చర్యలు తీసుకోవాలని వినతులు

4



చైతన్యరథం

# ధాన్యం కొనుగోలులో..

# ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు

- ఏ రైసుమిల్లులో అయినా అమ్ముకునే సౌలభ్యం కల్పించాం
- లోడింగ్‌లో జాప్యం ఉండొద్దు..వాహనాలకు జీపీఎస్ ఉండాలి
- సంచుల కొరత రానివ్వొద్దు..వాట్సాప్ సేవలూ సరిచూసుకోవాలి
- ఐవీఆర్ఎస్ ద్వారా రైతుల నుంచి సమాచారం తీసుకుంటున్నాం
- ఎక్కడైనా సమస్య ఉంటే స్వయంగా వస్తా..వివరణ కోరతా
- నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు
- ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు చెల్లింపులు
- గతేడాది ఈ సమయానికి 5.22 లక్షల మెట్రిక్ టన్నులే సేకరణ
- బియ్యం అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు
- కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదని, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం, రైస్ మిల్లర్ల సహాయ నిరాకరణ వల్ల రైతులు ఇబ్బంది పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉండవల్లిలో తన నివాసం నుంచి గురువారం 26 జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, మంత్రులు నాదెండ్ల మనోహర్,అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి ఎన్ని ఇబ్బందులుపడ్డారో చూశామని, అందుకే ఈసారి ధాన్యం కొనుగోళ్లలో సమూల మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ధాన్యం అమ్మే రైతులు ఏ మిల్లుకు అయినా ధాన్యం పంపవచ్చని తెలిపారు. గతంలో ప్రభుత్వం సూచించిన మిల్లులకు మాత్రమే రైతులు ధాన్యం పంపాల్సి ఉండటం వల్ల నాడు నెలల తరబడి ధాన్యం డబ్బులు రైతులకు జమ అయ్యేవి కావన్నారు. కానీ కూటమి ప్రభుత్వం 24 గంటల నుంచి 48 గంటల్లోపే ధాన్యం డబ్బు చెల్లించడమే కాకుండా రైతులు వాట్సాప్ ద్వారా తమ పంటను అమ్ముకునే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు,మిల్లర్లు, అధికారులతో ఉమ్మడిగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## అధికారులు, ఉద్యోగులదే బాధ్యత

ధాన్యం సేకరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వ తీసుకొచ్చిన ఈ విధానాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కిందస్థాయి ఉద్యోగులు, ప్రభుత్వసిబ్బందిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. డ్రయర్ల(ధాన్యం ఆరబెట్టే యంత్రాలు) ఏర్పాటు ద్వారా తేమ విషయంలో తలెత్తుతున్న సమస్యలు ఎంతవరకు పరిష్కారం చూపవచ్చు అనేది కూడా చూడాలని సూచించారు. ఈ సమీక్షలో ముందుగా ధాన్యం సేకరణ వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 1.51 లక్షల మంది రైతుల నుంచి 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామని వివరించారు. నేటికీ రూ.2,331 కోట్లు రైతులకు చెల్లించామని తెలిపారు. ఇందులో రూ.2,202 కోట్లు 24 గంటల్లో చెల్లించగా, మిగిలిన రూ.128 కోట్లు 48 గంటల వ్యవధిలో చెల్లించినట్లు చెప్పారు.

## అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో కొనుగోలు

మొత్తం 14జిల్లాల్లో ధాన్యంకొనుగోలు చేస్తుండగా, అందులో తూర్పు గోదావరి జిల్లాలో 1.84 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమ గోదావరిలో 1.81 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 1.69లక్షల మెట్రిక్ టన్నులు, కోనసీమలో 1.44 లక్షల మెట్రిక్ టన్నులు, కృష్ణాలో 1.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి నట్లు అధికారులు వివరించారు. వీటితో పాటు మరో 9 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సమయానికి కేవలం 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొను గోలు చేయగా, ఇదే సమయానికి ఈ ఏడాది నేటికీ 10,59,457మెట్రిక్ టన్నుల ధాన్యం కోనుగోలు చేశా రు. అంటే గతేడాది కంటే రెట్టింపు మొత్తంలో ఈ ఏడా ది ధాన్యం కొనుగోలు జరపడంతోపాటు 48 గంటల వ్యవధిలోనే మొత్తం 1.45 లక్షల మంది రైతులకు డబ్బులు చెల్లించడం జరిగిందని అధికారులు వివరించారు. తుఫాన్ ప్రభావం కారణంగా ఆందోళన చెందుతున్న రైతులను అర్థంచేసుకుని మరింత వేగంగా పెద్దఎత్తున ధాన్యం కోనుగోలు చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం ధాన్యం సేకరణలో గత 10 రోజుల్లోనే 60 శాతం చేసినట్లు తెలిపారు.

## ధాన్యం సంచుల కొరత రానివ్వొద్దు

రైతులు ధాన్యం సంచుల కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా చూడాలని చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు. వాట్సాప్ ద్వారా కొనుగోళ్లు అని చెప్పాం.. దాని అమలు సక్రమంగా అవుతుందా లేదా.. ఫలితాలు ఎలా ఉన్నాయి అనేది కూడా సరిచూసు కోవాలని సూచించారు. రైతులు తమ చుట్టూ తిరగాలనే సంస్కృతి ఎక్కడా కనిపించకూడదని తెలిపారు. ఏ రైస్‌మిల్లు వాళ్లు అయినా రైతులను ఇబ్బంది పెడతాం.. ప్రభుత్వానికి సహకరించం అంటే కుదరదని అలాంటి వారిపై చర్యలకు వెనుకాడొద్దని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల్లో లోడింగ్‌కు ఎక్కువ సమయం పట్టకుండా చూడాలని, వాహనాలకు జీపీఎస్ విధానం అమలు చేయాలని చెప్పారు.

## ప్రతిరోజూ మీడియాకు ధాన్యం కొనుగోలు సమాచారం

ఆయా జిల్లాల్లో ప్రతిరోజూ కొనుగోలు వివరాలు మీడియా ద్వారా కలెక్టర్లు, అధికారులు ప్రజలకు వివరించాలని సూచించారు. రైతుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా సమా చారం తీసుకుంటున్నాం. వారి నుంచి సంతృప్తి వ్యక్తం కాకపోతే దానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్య ఉందని తెలిస్తే ఈ సారి తానే స్వయంగా ఆ ప్రాంతానికి వెళతానని, అక్కడి నుంచే అధికారులను వివరణ కోరుతానని తెలిపారు. ప్రభుత్వం నిధులు అందుబాటులో ఉండి అన్నివిధాలుగా మద్దతుగా ఉండి కూడా అధికారులు, ఉద్యోగుల వైఫల్యం వల్ల చెడ్డపేరు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. తేమ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా రైతుల కోసం ఏం చేయవచ్చు అనేది కూడా చూడాలని సూచించారు.

## బియ్యం స్మగ్లింగ్ చేస్తే ఉపేక్షించేది లేదు

రాష్ట్రంలో రేషన్‌బియ్యం రీ సైక్లింగ్, స్మగ్లింగ్ అనేది పెద్ద మాఫియాగా మారిపోయిందని, ఈ సమస్య పరి ష్కారం కోసం అధికార యంత్రాంగం ప్రత్యేకమైన ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. బియ్యం స్మగ్లిం గ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు, ఇకపై ఎక్కడా స్మగ్లింగ్ జరగకుండా చూడాలని ఆదేశించారు.

## సీఎం దృష్టికి వల్లూరిపాలెం రైతులు ఆందోళన

కృష్ణా జిల్లా వల్లూరిపాలెం రైతుల ఆందోళన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఘటనపై కృష్ణాజిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన ముఖ్యమంత్రి.. కలెక్టర్ నుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు. రైతుల ఆందోళనకు అధికారుల నిర్లక్ష్యం కారణమైతే విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలను పక్కాగా అమలు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం సూచించారు. అలాగే, జిల్లా పరిధిలో జరుగుతున్న కొనుగోళ్ల అంశాన్ని నిత్యం పర్యవేక్షించి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం కొలువుదీరింది. భాజపా అగ్రనేత దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అగ్రనాయకుడు అజిత్‌పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వీరితో ప్రమాణం చేయించారు. కేంద్రంలోని అతిరథ మహారథులు హాజరైన కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు సైతం హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రాలు.



# కృత్రిమ మేధలో తొలి అడుగు

## ఏపీ ప్రభుత్వంతో గూగుల్ సంస్థ కీలక ఒప్పందం

- అంతర్జాతీయస్థాయి అవకాశాలకు యువతకు నైపుణ్య శిక్షణ
- స్టార్టప్‌లు, పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, హెల్త్‌కేర్‌లో సేవలు
- ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణలకు సహకారం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ



అమరావతి(చైతన్యరథం): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తొలి అడుగు వేసింది. ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం జరిగింది. విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో గూగుల్ క్లౌడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అండ్ కంట్రీ ఎండీ బిక్రమ్‌సింగ్ బేడీ, ఏపీ రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ నడుమ సచివాలయంలో అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయంగా ఏఐ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో గూగుల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. దీంతో పాటు స్టార్టప్‌లు, సాంప్రదాయ పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలకు అవసరమైన ఏఐ ఆధారిత సేవల కోసం శిక్షణ కార్యక్రమాలను చేపడుతుంది.ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ సుస్థిరత వంటి కీలకమైన అంశాల్లో ఏఐ ఎంఎల్ సొల్యూషన్స్‌ను ఏకీకృతంచేయడానికి గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరిస్తుంది. ఏఐ ఆధారిత వ్యవస్థలో ఆర్థిక వృద్ధి చెందడానికి అవసరమైన శిక్షణ, వనరులను యువతకు అందించడం ద్వారా నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, డిజిటల్ మౌలిక సదుపా యాల అభివృద్ధికి గూగుల్ సంస్థ సహకారాన్ని అందిస్తుంది. దీంతోపాటు ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణలు, స్టార్టప్ ఎకో సిస్టమ్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ సహకారాన్ని అందిస్తుంది. ఎంఓయూ సందర్భంగా అమరావతి సెక్రటేరియట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఈవో దినేష్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీ ప్రభుత్వ ఇన్వెస్టిమెంట్స్ విభాగం ఉన్నతాధికారి యువరాజ్ పాల్గొన్నారు.

### చంద్రబాబు ఆలోచనల అమలుకు దోహదం

పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడం ద్వారా ప్రజల కు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. తాము ఏపీ ప్రభుత్వంతో కలిసి చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తు ఏఐ ఆధారిత సేవల్లో సాధికారిత సాధించడానికి ఆలంబనగా నిలుస్తాయని అన్నారు. ఏఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి గూగుల్ కట్టుబడి ఉంది. మేము ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాల కోసం ప్రాథమిక పరిశోధనకు ప్రాధాన్యతనిస్తాం. విభిన్న కమ్యూనిటీల సహకారంతో వేగవంతమైన పురోగతి సాధించాలన్నది తమ లక్ష్యం. ఏఐ ద్వారా సమాజానికి సానుకూ ల ప్రయోజనాలను పెంచడానికి గూగుల్ కట్టుబడి ఉంది. మేము ప్రపంచంలోని అత్యం త ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాల కోసం ప్రాథమిక పరిశోధనకు ప్రాధాన్యతనిస్తాం. విభిన్న కమ్యూనిటీల సహకారంతో వేగవంతమైన పురోగతి సాధించాలన్నది తమ లక్ష్యమని లలిత రమణి చెప్పారు.

### ఈజ్ ఆఫ్ లివింగ్ మా ప్రభుత్వ లక్ష్యం

ఈ సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అందుబాటులో ఉండే సెల్‌ఫోన్ వంటి సాధనం ద్వారా ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యువతకు ఏఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఏఐ ఆధారిత ఏకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం, క్లిష్టమైన రంగాల్లో ఏఐ సేవలను వినియోగించడం ద్వారా కార్యకలాపాలను సులభతరం చేయడం, ఏఐలో శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నెలకొల్పడం, స్థానిక స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ప్రజలకు ఏఐ ప్రయోజనాలకు అందుబాటులోకి తేవడం గూగుల్ ఒప్పందం ముఖ్యోద్దేశమని తెలిపారు. ఏఐ ఆధారిత సాధికారితకు అవసరమైన వర్క్ ఫోర్స్‌ను తయారు చేయడంలో గూగుల్ కీలకపాత్ర వహిస్తుందని చెప్పారు. గూగుల్‌తో తాము చేసుకున్న ఒప్పందం ద్వారా ఏఐ రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోవడంతో పాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

### గూగుల్ ఒప్పందంలోని కీలకాంశాలు

*విద్య, నైపుణ్యాభివృద్ధి:* విద్యార్థులు, డెవలపర్లకు ఎఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేల మందికి గూగుల్ ఎసెన్సిషియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సు అందిస్తుంది. రోజువారీ జీవితంలో ఏఐని ఎలా ఉపయోగించాలి, ఏఐ ద్వారా ఉత్పాదకత, సామర్థ్యాన్ని పెంచడం వంటివి ఈ కోర్సులో అంతర్భాగంగా ఉంటాయి. సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ జనరేటివ్ ఏఐ వంటి రంగాల్లో గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్‌లు, స్కిల్ బ్యాడ్జ్‌లను గూగుల్ అందజేస్తుంది. ప్రభుత్వ ఏజెన్సీల కోసం స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను అందించడానికి ప్రభుత్వంతో గూగుల్ క్లౌడ్ సహకరిస్తుంది. కంప్యూటర్ సైన్స్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అధ్యాపకులకు గూగుల్ సాంకేతిక మద్దతును అందిస్తుంది. స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లలో గూగుల్ డెవలపర్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు, ఆండ్రాయిడ్, యాప్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లకు గూగుల్ ద్వారా యాక్సెస్ లభిస్తుంది.

*స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబుల్‌మెంట్:* ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌ను ప్రోత్సహించడం, మెంటర్‌షిప్, నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం, స్టార్టప్ యాక్సి లరేటర్ ప్రోగ్రామ్‌ల కోసం గూగుల్ యాక్సెస్‌ను అందిస్తుంది. ఇందుకోసం గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌తో కలిసి పనిచేస్తుంది. దీంతోపాటు అర్హత కలిగిన ఏఐ స్టార్టప్‌లు క్లౌడ్ క్రెడిట్‌లు, సాంకేతిక శిక్షణ వ్యాపార మద్దతును పొందుతాయి.

*సుస్థిరత:* గాలి నాణ్యత, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో గూగుల్ ఎఐ ఆధారిత సహకారం, సేవలను అందిస్తుంది.

*హెల్త్‌కేర్:* నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చడం, రోగి ఆరోగ్య ఫలితాలను వేగవంతం చేయడంలో ఏఐ సేవల వినియోగానికి సహకారం. హెల్త్ ఏఐ ఇమేజింగ్ మోడల్‌లకు యాక్సెస్ అందించడం, ఎల్‌ఎల్‌ఎంలు ద్వారా హెల్త్ కేర్ ఉత్పాద నంలో ఏఐ అప్లికేషన్‌లను అన్వేషించడం, హెల్త్ ఏఐ డెవలపర్ ఫౌండేషన్స్ (హెచ్‌ఏఎల్ డీఈఎఫ్) ద్వారా పరిశోధన కార్యక్రమాలకు గూగుల్ మద్దతు ఇస్తుంది.

*ఏఐ పైలట్‌లు:* వ్యవసాయం, ట్రాఫిక్ నిర్వహణ, వెబ్‌సైట్ ఆధునీకరణ, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో క్లౌడ్ టెక్నాలజీ, ఏఐ ప్రయోజనాలపై కీలక రంగాలలో పైలట్ ప్రాజెక్టులకు గూగుల్ సహకరిస్తుంది.

### తొలుత చంద్రబాబును కలిసిన గూగుల్ ప్రతినిధులు

ఏఐలో రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య మంత్రి నారా లోకేష్ సమక్షంలో జరిగిన ఒప్పందానికి ముందు గూగుల్ ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. గూగుల్ క్లౌడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అండ్ కంట్రీ ఎండీ బిక్రమ్ సింగ్ బేడీ ఉండవల్లి నివాసంలో చంద్రబాబును కలిసి చర్చించారు. ఈ సందర్భంగా గూగుల్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం ఒక గొప్ప ముందడుగని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న డీప్‌టెక్ కాన్‌క్లేవ్ 2024 విశాఖపట్నంలో శుక్రవారం మొదలవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల గ్లోబల్ కాంక్లేవ్‌ను ప్రారంభిస్తారు. డీప్ టెక్నాలజీ పరిశ్రమ ఏపీలో బలంగా వేళ్లూనుకోవడానికి ఈ కాన్‌క్లేవ్ ఉపకరిస్తుందన్న నమ్మకాలు లేకపోలేదు. ముంబయి పర్యటన ముగించుకుని గురువారం రాత్రికే విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాదర స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు, ప్రతినిధులు, అధికార్లు.











# స్థలం కబ్జాకోరుకు సీఐ శ్రీరామ్ అండదండలు

- ప్రశ్నించిన బాధితులకు బెదిరింపులు
- ప్రజావినతుల్లో హోంమంత్రి అనితకు ఫిర్యాదు
- దాడులు, భూ కబ్జాలపై గ్రీవెన్స్‌లో వెల్లువెత్తిన అర్జీలు
- వైసీపీ మూకల అరాచకాలపై చర్యలు తీసుకోవాలని వినతులు

అమరావతి(చైతన్యరథం): తన కుమార్తెకు కట్నం కింద ఇచ్చిన 7 సెంట్ల భూమిని ఎన్.మధుసూదన్ అనే వ్యక్తి కబ్జాచేసి సీఐ శ్రీరామ్ ప్రధాన అనుచరుడు బినామీ అయిన మేరవ నారాయణ అనే వ్యక్తిపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కర్నూలు జిల్లా ఆత్మకూరు గ్రామం దళితవాడకు చెందిన ఎస్.ఎస్.ఎస్.రత్నం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్థలం మాది అని అడిగినందుకు సీఐ శ్రీరామ్ నేను పయ్యావుల కేశవ్‌నే ఎదురించిన వాడిని మర్యాదగా స్థలం వదులుకోండి అని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వారి దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసి తమకు న్యాయం చేయవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల కార్యక్రమానికి ఎక్కువగా భూ కబ్జాలు, వైసీపీ అరాచకాలపైనే ఫిర్యాదులు వచ్చాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంలో హోం మంత్రి అనిత,ఎమ్మెల్సీ దువ్వాడపు రామారావు, దూండీ రాకేష్‌లు అర్జీలు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి వెంటనే అర్జీలను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

– తమ ప్రాంతంలో గత కొన్నిసంవత్సరాల నుంచి వ్యభిచారం, గంజాయి తదితర చట్టవ్యతిరేకమైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని గుంటూరు నగరం కొత్తపేట,ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన గుంజి అంకబాబు ఫిర్యాదు చేశారు. దాని ఫలితంగా పిల్లలు, యువకులు గంజాయికి, వ్యభిచార వృత్తికి అలవాటు పడుతున్నారు. ఆసాంఘిక కార్యక్రమాలపై దృష్టిపెట్టి విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేశాడు.

– తమ పూర్వీకులు ఇచ్చిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని తిరుపతి జిల్లా తుమ్మలగుంట గ్రామానికి చెందిన ఎస్.సరస్వతి ఫిర్యాదు చేసింది. కబ్జాదారుల నుంచి తమ స్థలం విడిపించాలని వినతిపత్రం అందజేశారు.

– తమకు వారసత్వంగా వచ్చిన భూమిని కబ్జా చేసి గోపాల్, వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకుని తిరిగి తమపైనే బైండోవర్ కేసులు పెట్టి వేధిస్తున్నా రని అనంతపురం జిల్లా గుంతకల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వైద్యుడు ఎస్.మాధవరావు వాపోయాడు. భూమిని విడిపించి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

– చిత్తూరు దామరపాకానికి చెందిన దివ్యాంగుడు ఎన్.చిరంజీవి సమస్యను వివరి స్తూ తనకు రూ.3 వేల పింఛన్ వస్తుంది..కానీ వాస్తవం నేను 90 శాతం అంగవైకల్యం కలిగి ఉన్నానని నిమ్స్ హాస్పటల్ సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కల్పిస్తు న్న రూ.6 వేల పింఛన్ ఇప్పించాలని విన్నవించుకున్నారు.

– చిత్తూరు జిల్లా నగరి మండలం దామరపానికి చెందిన నారాయణశెట్టి సమస్యను వివరిస్తూ తన తండ్రి పేరిట ఉన్న 1.56 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన జి.లీలారామ్ ఆక్రమించాడని ఫిర్యాదు చేశాడు. తమ భూమిని తమకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

– ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కోటాలపల్లిలో ఎంపీపీ స్కూల్ ఆట స్థలా న్ని వైసీపీ నాయకులైన పొట్లూరి పోలయ్య, మాదిరెడ్డి మాలకొండయ్య ఆక్రమించి విద్యా ర్థులకు ఆట స్థలం లేకుండా చేశారని గ్రామానికి చెందిన ఎం.హరిబాబు ఫిర్యాదు చేశాడు. ఆట స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆ స్థలాన్ని తిరిగి స్కూల్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశాడు.

– పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన గుర్రపుశాల రామకృష్ణ (టీడీపీ రజక సాధికార రాష్ట్ర కన్వీనర్) అనే వ్యక్తి విజ్ఞప్తి చేస్తూ.. నేను కేవలం తెలుగుదేశం పార్టీ నాయకుడిని అని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కక్షపూరితంగా మా కుటుంబ భూములను గ్రామంలోని కొంతమంది పేరుపై నమోదు చేయించి మా కుటుంబసభ్యులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. తమ భూములు తిరిగి ఇప్పించాలని విన్నవించుకున్నారు.

– అపార్ట్‌మెంట్‌లో మూడో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న తనను రెండో ఫ్లోర్‌లో ఉంటున్న వలిఖాన్, ఫిరోజ్‌ఖాన్ మెట్ల దగ్గర అడ్డుగా కూర్చొని ప్రతిరోజూ వేధిస్తున్నారని కడపజిల్లాకు చెందిన వివాహిత పి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేసింది. తనను, తన కుమారుడిని కొట్టి సెల్‌ఫోన్ కూడా పగులగొట్టి కులం పేరుతో దూషించారు. వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

– తిరుపతి జీపాళ్యం పంచాయతీ కురకాల్వ గ్రామానికి పి.లక్ష్మి సమస్యను వివరి స్తూ 2012లో ప్రభుత్వం ఇచ్చిన భూమిని చంద్రయ్య,సురేష్, నల్ల పాళం శీనయ్య అనే వ్యక్తులు కబ్జా చేయాలని మా ఇంటిని కూల్చివేశారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే చంపే స్తామని బెదిరిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఇంటిని ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చారు.

– టీడీపీ కార్యకర్తలమైన తమకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణ, వైసీపీ సర్పంచ్ గాంధీ, నాయకులు కలిసి మా ఇంటికి దారి లేకుండా అడ్డుగా గోడ కట్టారని చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మండలం కొల్లాగుంట గ్రామం రజక కుటుంబానికి చెందిన సి.మొహనవల్లి ఫిర్యాదు చేశారు. ప్రశ్నించినందుకు 35 మంది వైసీపీ సైకో బ్యాచ్ తమ ఇంటిపై దాడి చేసి ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి మా కుటుంబ పరు వు తీయటంతో తన చెల్లి ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణ మైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

– 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 72 మందిని టెక్నికల్ బోటు సిబ్బందిగా నియమించారని, వైసీపీ ప్రభుత్వం 2022 ఆగస్టులో తమను విధుల నుంచి తొల గించారని సెక్యూరిటీ పోలీస్ టెక్నికల్ బోటు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.





చైతన్యరథం



### జ్యుడీషియల్ ప్రివ్యూ చట్టం రద్దుచేస్తూ నోటిఫికేషన్

అమరావతి (చైతన్య రథం): ఏపీలో జ్యుడీషియల్ ప్రివ్యూ చట్టం రద్దు చేస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. టెండర్ల జారీలో కేంద్రం మార్గదర్శకాలు, విజిలెన్స్ కమిషన్ నిబంధనలు పాటిస్తున్నందున జ్యుడీషియల్ ప్రివ్యూ చట్టం రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈమేరకు గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# 14నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు

## రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

అమరావతి (చైతన్య రథం): సాగునీటి సంఘాలకు ఎన్నికలను డిసెంబరు 14నుంచి నిర్వహించనున్నట్లు రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో పాత్రికేయులతో మాట్లాడుతూ వ్యవసాయం, రైతాంగమే రాష్ట్రానికి ప్రాణమనే ఉద్దేశ్యంతో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి, చివరి ఎకరం వరకూ సాగు నీరు అందజేయాలనే లక్ష్యంతో సాగునీటి సంఘాలను పునరుద్ధంచాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. సాగునీటి సంఘాలకు మూడు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. తొలిరోజు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, రెండోరోజు డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు, మూడో రోజు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సేవా దృక్పథంతో పనిచేసే వ్యక్తులు ఈ సంఘాలకు ప్రతినిధులుగా ఉండటం అవసరమని, అటువంటి



ఎన్నికల్లో ఎటువంటి వర్గ, పార్టీ పోరు లేకుండా సాధ్యమైనంత మేర ఏకగ్రీవంగా ప్రతినిధులను ఎన్నుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు.

దేశానికి వెన్నెముక అయిన రైతాంగం సంక్షేమాన్ని కాంక్షిస్తూ 2015లో తమ ప్రభుత్వం సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం వాటి విలువను గుర్తించకుండా 2020లో సాగు నీటి సంఘాలను అన్నింటినీ రద్దు చేసిందన్నారు. రైతులు, వ్యవసాయంపై గత ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యధోరణికి ఇది నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణకు ఎటువంటి నిధులు విడుదల చేయకుండా ప్రాజెక్టులను అన్నింటినీ గాలికి వదిలేసిందన్నారు. ఫలితంగా గుండ్లకమ్మ, పులిచింతల, అన్నమయ్య ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకు పోవడం జరిగిందన్నారు. ఈ మధ్య రైవస్ కెనాల్ గేటు కూడా కొట్టుకు పోయిందన్నారు. ఆయన తెలిపారు. అటు వంటి పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకే తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజక్టుల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# జేబుదొంగ కాదు, గజదొంగ!

## ఎమ్మెల్యే జగన్‌పై ఏపీఎస్ఏడీఏ చైర్మన్ ఆనం విసుర్లు

- ఎవ్వరైనా రూ.2 వేల కోట్ల ఆస్తిని రూ.12 కోట్లకు అమ్ముతారా?
- రూ.2,689 కోట్ల షేర్ విలువను రూ.494 కోట్లకే ఇచ్చేస్తారా?
- జగన్, విజయసాయి ఇళ్లు అలా అమ్ముతారా..?
- అమ్మితే.. కొనడానికి నేను రెడీ
- గన్నుపెట్టి బెదిరించి లాక్కుంటేనే అలా జరిగింది..
- గొంతుమీద కత్తిపెట్టి సీ పోర్టులో వాటా కొట్టేశారు
- రూ.494 కోట్లకే 41శాతం వాటా కొట్టేయడం మాఫియా పనే?
- ఏ1గా జగన్‌నూ చేర్చి.. అరెస్టులతో వాస్తవాలు బయటపెట్టాలి



అమరావతి (చైతన్యరథం): కేవీరావు గొంతుమీద కత్తిపెట్టి రూ. 2వేల కోట్ల విలువైన కాకినాడ సెజ్ భూములను రూ.12 కోట్లకు, కాకినాడ సీపోర్టులో రూ. 2,689 కోట్ల విలువైన షేర్లను రూ. 494 కోట్లకే కొట్టేసిన వైసీపీ దోపిడీ ముఠా, వారి వెనుకున్న జగన్‌రెడ్డిని తక్షణం అరెస్ట్ చేసి విచారించి వాస్తవాలను బయటపెట్టాలని ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణా రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌రెడ్డి జేబు దొంగని అనాడే చెప్పామని, నేడు సీఐడీ ఛార్జ్‌షీట్ ఓపెన్ చేసిన వైనం చూస్తే గజదొంగని అర్థమవుతుందన్నారు. కాకినాడ సెజ్ విస్తీర్ణం 8,320 ఎకరాల్లో ఉందని, 2012 ఫిబ్రవరి 28న భారత ప్రభుత్వం కాకినాడ సెజ్‌కు ఈ భూములను కేటాయించిందన్నారు. శ్రీ సిటీ తరువాత ఏపీలో కాకినాడే సెజ్ పెద్దదని వివరించారు. ఈ సెజ్‌పై జగన్ రెడ్డి కళ్లు పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముఠా వైవీ సుబ్బారెడ్డి కొడుకు విక్రాంత్ రెడ్డి, లిక్కర్ స్కాంలో జైల్లో ఉండి వచ్చిన శరత్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలతో బెదిరింపులకు దిగారన్నారు. దీంతో కేవీరావు ఫిర్యాదుపై వారి పేర్లను ఛార్జ్ షీట్‌లో పెట్టారన్నారు. కత్తులు, గన్నులు పెట్టి అప్పుడే షేర్లు, భూములు కొట్టేసేందుకు కేవీరావును బెదిరించారన్నారు. భారత దేశంలో ఎక్కడైనా రూ.29 వేలకే ఒక ఎకరా భూమి దొరుకుతుందా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి బెంగళూరులోని తన ప్యాలెస్ లేదా తాడేపల్లి ప్యాలెస్‌ను కోటిరూపాయలకు నాకు ఇస్తాడా? విజయసాయిరెడ్డికి హైదరాబాద్ లో ఒకటిన్న ఎకరాల్లో ఇళ్లు ఉంది దాన్ని 60 వేలకు నాకు అమ్ముతాడా? బెదిరించి కేవీరావు వద్ద లాక్కోకుంటేనే ఇలా జరుగుతుందన్నారు. 4 వేల ఎకరాలను ఎవరైనా రూ. 12 కోట్లకు ఇస్తారా? 12.10.2020 లో అగ్రిమెంట్ చేసుకుని 31.03.2021 లో చెక్కు పేమెంట్ ఇచ్చారన్నారు. ఎవరైనా ఆరు నెలల తరువాత పేమెంట్ ఇస్తారా? సాక్షిలో ఇష్టం వచ్చినట్లు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరు నెలల తరువాత చెక్ పేమెంట్ ఇవ్వడానికి తాము సిద్ధమని, ఇలానే మీ ఆస్తులు కూడా రాసి తనకు రాసివ్వాలని సవాలు చేశారు. ఏదైనా కంపెనీ డబ్బులు సంపాదిస్తుందంటే చాలు ఆ కంపెనీని కైవసం చేసుకోవడానికి వైసీపీ నేతలు యత్నిస్తుంటారన్నారు. యజమానులను ఇంటికి పిలిచి బెదిరిస్తారన్నారు. విక్రాంత్ రెడ్డిలాంటి వ్యక్తులను పెట్టుకుని జగన్ రెడ్డి ఈ దారుణాలకు పాల్పడుతుంటాడన్నారు. అందుకే కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి భయపడి పారిపోయాయన్నారు.

ప్రముఖ కన్సల్టెంట్ రోహిత్ చతుర్వేది నివేదిక ప్రకారం కాకినాడ సెజ్ భూముల వ్యాల్యుయేష్ చూస్తే కళ్లు జిగేల్ మంటాయన్నారు. కాకినాడ సెజ్‌లో ఒక్కొక్క ఎకరా రేటు రూ.50 లక్షల 20 వేల రూపాయల ధర ఉంటుందని రోహిత్ చతుర్వేది పేర్కొన్నారని, దీనిని బట్టి నాలుగువేల ఎకరాల రేటు ఎంతుంటుందో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. దాదాపు రూ. 4వేల 135 కోట్లు ఉంటుందని, అందులో కేవీరావు వాటా రూ. 2 వేల కోట్లపైనే ఉంటుందన్నారు. రూ. 2 వేల కోట్ల ఆస్తులను రూ. 12 కోట్లు కొట్టేయడం బెదిరించి లాక్కోవడం కాక ఏమంటారని ప్రశ్నించారు. ఈ దోపిడీ వల్ల వైసీపీ ముఠా రూ. 1,900 కోట్లకు పైగా లాభం గుంజేసిందన్నారు. జగన్ రెడ్డి ఆజ్ఞతోనే విజయసాయిరెడ్డి, శరత్ రెడ్డి, విక్రాంత్ రెడ్డి ఈ దుర్మార్గాలకు తెరలేపారన్నారు. కాకినాడలో డీప్ సీ పోర్టు, కళింగా ఇంటర్ నేషనల్ పోర్టులు ఉన్నాయన్నారు. కళింగలో కూడా కేవీరావుకు షేర్లు ఉన్నాయన్నారు. కాకినాడ సీ పోర్టు ఒక్కదాంట్లోనే ఈ సంవత్సరం సగటు ఆదాయం రూ. 451 కోట్ల నుండి రూ. 530 కోట్ల మధ్య ఉందన్నారు. గతంలో రూ. 290 కోట్ల నుండి 330 కోట్లు సంపాదించిందన్నారు. ఇంత లాభాల్లో ఉన్న కంపెనీని ఎవరైనా తక్కువ రేటుకు అమ్ముకుంటారా? అని ప్రశ్నించారు.

కాకినాడ డీప్ సీ పోర్టును కైవసం చేసుకోవడానికి గత ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందించకుండా శ్రీకాంత్ రెడ్డి, శరత్ రెడ్డిని జగన్ రెడ్డి రంగంలో దింపారన్నారు. పీకెఎఫ్ శ్రీధరన్ సంతానం, కోల్ ఇండియా అనే ఆడిట్ సంస్థలతో 28 రోజుల పాటు అక్రమ ఆడిట్ చేయించారన్నారు. దాని ప్రకారం ప్రభుత్వానికి రూ.1000 కోట్లు కట్టాలని కేవీరావును బెదిరించారున్నారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సల్టెంట్లతో ఆడిట్ చేసి ఒత్తిడి తెచ్చారన్నారు. రూ.1000 కోట్లు కట్టకపోతే కేసులు పెడతామని బెదిరించి సీ పోర్టులో వాటాల బదిలీకి డిమాండ్ చేశారన్నారు. లేని పక్షంలో పోర్టును స్వాధీనం చేసుకుంటామని భయపెట్టారన్నారు. షిప్పింగ్ ఏజెంట్లను కూడా భయపెట్టారున్నారు. చివరకు కేవీరావు గొంతు మీద కత్తి పెట్టి 41% శాతం వాటాను కొట్టేశారన్నారు. షేర్లు వైసీపీ ముఠాకు బదిలీ అయిన వెంటనే పరిస్థితి మారిపోయిందన్నారు. ప్రభుత్వానికి రూ.1000 కోట్లు కట్టాలని చెప్పిన జరిమానా కాస్తా రూ. 8 కోట్లకు తగ్గిపోయిందన్నారు. అసలు చెన్నై నుండి ఆడిటర్లు ఇక్కడకు వచ్చి ఆడిట్ చేయడంలోనే కుట్ర అర్థమై పోతుందన్నారు. రాష్ట్రంలో ఆడిటర్లు లేరా, లేరనుకుంటే ప్రభుత్వ యంత్రాంగమే ఆడిట్ చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. అసలు ఆర్థిక శాఖలో ఆడిటర్లు ఏమయ్యారన్నారు. గతంలో విజయసాయిరెడ్డి చెన్నైలో ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉండేవాడన్నారు. సాయిరెడ్డి దింపిన సంస్థతోనే ఈ మోసాలకు తెరతీశాడన్నారు. మంత్రాంగం నడిపి రూ. 2,689 కోట్ల షేర్ విలువను రూ. 494 కోట్లకే పరిమితం చేసి కొట్టేశారన్నారు. వైసీపీ నేతలు పెట్టిన 494 కోట్ల పెట్టుబడిలో గత సంవత్సరమే రూ. 380 కోట్లు వారికి సీ పోర్టు నుండి డివిడెండ్ల సొమ్ము ఐసీడీ డిపాజిట్ల రూపంలో వారికిచేరిందన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ1 గా ఉండాల్సింది విక్రాంత్‌రెడ్డి కాదని, జగన్‌రెడ్డి అన్నారు.

కర్త కర్మ క్రియ అన్ని కూడా జగన్ రెడ్డేన న్నారు. డీజీపీ, సీఐడీ దీన్ని గుర్తించి జగన్‌రెడ్డిని ఏ1 గా నమోదు చేయాలన్నారు. ఈ కుట్ర జరిగింది తాడేపల్లి ప్యాలెస్ లోనేనని స్పష్ట మవుతోందన్నారు. వెంటనే డీజీపీ రంగంలోకి దిగి జగన్‌రెడ్డి నిజ స్వరూపం బయటపెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత రాక్షస పాలనను చూసి కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టాలంటే వణికిపోతున్నాయన్నారు. నేడు వ్యాపార వేత్తల కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడే పరిస్థితి దాపురించిందన్నారు. కేవీరావు నాడు నోరు తెరిస్తే భూమిమీద లేకుండా చేసేవారన్నారు. సాక్షిలో వచ్చిన వార్తలు చూస్తే విజయసాయిరెడ్డి మాటలు నీచులు నీజాయితీ సూక్తులు చెప్పినట్లుగా ఉంటాయన్నారు. అమెరికాలో ఉన్న వ్యక్తుల పేర్ల మీద కేవీరావుకు సంబంధించిన మిగిలిన షేర్లు ఉండడం వల్ల వాటినైనా ఉంచారన్నారు. లేదంటే ఆ సీపోర్టు ముందే కేవీరావును వాచ్‌మేన్‌గా నిలబెట్టేవారన్నారు. షేర్ ట్రాన్సఫర్స్ చట్ట విరుద్ధమని యాక్సిస్ బ్యాంకు నోటీసు ఇచ్చినప్పటికీ లెక్కచేయకుండా షేర్ల బదిలీలు జరిగిపోయాయన్నారు.

# కదిలొస్తాడట.. కంసమామ!?

అధికారంలో ఉండగా ప్రచార్భాటం, అధికారం కోల్పోయాక బొంకు రాజకీయం జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. అతనికి జన్మతః వచ్చిన నీచమైన అలవాటు 'అబద్ధం'! జగన్‌రెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక, పరీక్షలు రాయలేని పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాల ద్వారా బయటకు గెంటివేయబడిన విద్యార్థులు, తమ బాధలను ఇంట్లో తల్లితండ్రులకు కూడా చెప్పలేని పరిస్థితుల్లో తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు. ఈ విధంగా విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడమే కాక, వారిలో ఆత్మవిశ్వాసాన్ని తగ్గించిన ఇప్పుడు నక్కజిత్తుల వేషాలు వేస్తూ మొసలి కన్నీరు కార్చడం జగన్‌కే చెల్లింది. గత ఐదేళ్ళలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా, విద్యార్థులపట్ల కనీస బాధ్యత లేకుండా వ్యవహరించిన జగన్‌రెడ్డికి, కూటమి ప్రభుత్వంపై తాను ఉంచిన "బకాయిల కుంపటి" గురించి అసలు తెలుసా లేదా? తెలిసినప్పటికీ లేనట్టు నటిస్తున్నాడా? అనే సందేహం ఆయన మాటలు విన్న ప్రతి ఒక్కరిలో తలెత్తక మానదు. ప్రజలు గద్దెనుంచి జగన్‌రెడ్డిని దించేనాటికి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,832 కోట్లు, వసతి దీవెన కింద మరో రూ.989 కోట్లు బకాయిపెట్టిన జగన్‌రెడ్డి, తానేదో విద్యార్థులను ఉద్ధరించినట్టు కలరింగ్ ఇస్తూంటే వినడానికే రోతగా ఉంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన జగన్... ఇప్పుడు నక్కజిత్తుల వేషాలు వేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నాడు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఫీజులు కట్టలేదని విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు కనీసం పరీక్షలు కూడా రాయనివ్వలేదు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద గత ప్రభుత్వాలు ఫీజుల డబ్బులను నేరుగా కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లో వేసేవి. కానీ, తల్లుల ఖాతాల్లో వేసే విధానాన్ని జగన్ తెచ్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడు. 2014-2019 టీడీపీ ప్రభుత్వం ఏటా 16 లక్షలమంది విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తే జగన్‌రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మందికి అది కూడా విడతల వారీగాఇచ్చి, దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులను మోసగించాడు. ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీ విద్యార్థులకు 2020-21 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలు నిలిపివేస్తూ జీవో నెం.77ను తెచ్చి, 1.7 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద విద్యార్థులకు అందకుండా చేసి వారి ఉన్నత చదువుల కలను చెరిపేశాడు.

వసతి దీవెన కింద ఒక్కో విద్యార్థికి ఏటా రూ.20వేలు ఇస్తానని హామీనిచ్చి, ఏ ఒక్క ఏడాదీ రూ.10వేలకు మించి ఇవ్వలేదు. ఐదేళ్లలో 10 విడతలు ఇవ్వాల్సింది కేవలం 4 విడతలతో సరిపెట్టడమే కాకుండా దానిలోనూ విచిత్ర నిబంధనలతో 11 లక్షల నుంచి 9 లక్షలకు తగ్గించి విద్యార్థులను ఇబ్బందిపెట్టిన జగన్‌రెడ్డి.. నేడు తానేదో ఉత్తమ పురుషుడిలాగా సొంత డబ్బా కొట్టుకోవటం దిగజారుడు రాజకీయానికి పరాకాష్ట.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2832 కోట్లు, వసతి దీవెన కింద రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.450 కోట్లు, కోడి గుడ్లకు రూ.200 కోట్లు, చిక్కీలకు రూ.56 కోట్లు.. జగన్ సర్కారు బకాయిలు పెట్టివెళ్లింది. విద్యార్థుల ట్యాబుల్లో రూ.2,832 కోట్లు, విద్యా కానుక పేరిట రూ.400 కోట్లు, నాడు నేడు పేరిట రంగులకు రూ.3,000 కోట్లు జగన్ సర్కారు దోపిడీకి పాల్పడింది. ఈ వాస్తవాలను కప్పిపుచ్చి.. విద్యావ్యవస్థను ఉద్ధరించినట్టు జగన్ చెప్తోన్న కబుర్లు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉంది.

## విద్యా వ్యవస్థలో సంక్షోభాలకు జగన్ ఆద్యుడు

- ఏటా డీఎస్సీ వేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మార్చడమే కాకుండా.. సీపీఎస్ హామీని నిలబెట్టుకోమన్నందుకు అహంకారంతో ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డాడు జగన్.
- 2014-2019 నాటి టీడీపీ పాలనలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు ఏర్పాటు చేసి 2,45,000 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే.. జగన్‌రెడ్డి ఆ పథకాన్నే రద్దు చేశాడు.
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం రద్దు చేశాడు.
- ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు చెందిన 160 ఎంబీబీఎస్ సీట్లను ఓపెన్ కేటగిరీకి మార్చి, కోట్ల రూపాయలకు అమ్ముకున్నాడు.
- జీవో నెం-1 రద్దు చేసి గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం చేశాడు.
- రాష్ట్రంలో 84 లక్షలమంది విద్యార్థులుంటే, కేవలం 44 లక్షలమందికే అమ్మఒడి ఇవ్వటమే కాకుండా, ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని, రూ.13వేలకు తగ్గించి మాట తప్పి మడమ తిప్పిన కంస మామ జగన్‌రెడ్డి.
- విశ్వవిద్యాలయాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలు 1385 వరకు చేపడితే, జగన్మోహన్ రెడ్డి పాలనలో ఒక్క నియామకం చేపట్టకపోగా విశ్వవిద్యాల యాలను రాజకీయ కలుషిత కేంద్రాలుగా మార్చేశాడు.
- సబ్జెక్టు టీచర్లతో బోధనంటూ 3, 4, 5 తరగతులను ప్రాథమిక బడులను, ఉన్నత పాఠశాలల్లో కలిపేసి సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేసి టీచర్ల మీద ఒత్తిడి తెచ్చాడు.
- రాష్ట్ర వ్యాప్తంగా 4,234 ప్రాథమిక పాఠశాలలను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనంచేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడు.
- తరగతుల విలీనం కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి 587 ప్రభుత్వ బడులు మూతపడ్డాయి. ప్రభుత్వ విధానంతో 1365 ఎయిడెడ్ బడులు కాలగర్భంలో కలిసిపోయాయి.
- గత ఐదేళ్ళలో ఏ రోజూ విద్యార్థుల సమస్యలు పట్టించుకోలేదు జగన్. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా, జగన్‌రెడ్డి పెట్టిన బకాయిల కుంపటి నెత్తి మీద మోస్తూ, విద్యార్థులకు భరోసా కల్పిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరు చూసి ఓర్వలేకపోతున్న జగన్‌రెడ్డి.. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి బొంకు ప్రచారానికి వస్తానని ప్రకటించుకోవడం నిస్సిగ్గు రాజకీయమే.
- ఐదేళ్లు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి, రాష్ట్ర సంపదను బొక్కిన జగన్‌రెడ్డి ఎప్పుడు కనిపిస్తాడా? పేద నీళ్లతో కడిగేద్దామా? అని ప్రజలు ఎదురుచూస్తున్న విషయం జగన్‌రెడ్డికి సంక్రాంతికి అవగతం కావడం ఖాయం.

- స్వరూప, అనలిస్ట్

# దేనికి ఉద్యమబాట బుల్‌బుల్ రెడ్డి?

- పెన్షన్లను రూ.4 వేలకు పెంచినందుకా?
- అన్న క్యాంటీన్లను పునరుద్ధరించినందుకా..
- ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తెచ్చినందుకా?
- డ్వాక్రా రుణాలను రూ.10 లక్షలకు పెంచినందుకా?
- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపినందుకా..
- లక్షలకోట్ల పెట్టుబడులు వస్తున్నందుకా..
- నువ్వు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించినందుకా..?
- 'దీపం-2'తో మహిళల్లో ఆనందం నింపినందుకా?
- కపట నాటకం తప్ప.. దేనిమీద నీ ఉద్యమం?



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తోంది. తొలి ఆరు నెలలోనే ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం చేయలేనన్ని పనులు ఈ ప్రభుత్వం చేసింది. ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా ఓర్వలేని బులుగు నాయకులు పూటకో అబద్ధం, రోజుకో రోత కథనంతో విషం చిమ్ముతూనే ఉన్నారు. కనీసం గోతులు కూడా పూడ్చలేని మీకెందుకు అధికారం అని వైసీపీని గత ఎన్నికల్లో గుంత తవ్వి పూడ్చిపెట్టారు ప్రజలు. అయినా తీరు మార్చుకోని జగన్‌రెడ్డి.. ప్రభుత్వంపై అబాండాలు వేసేందుకు ఉద్యమబాట అంటూ మరో నాటకానికి తెరలేపనున్నారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై అసత్యాలు చెప్పడం మొదలు పెట్టారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రం నెత్తిన రూ.12 లక్షల కోట్లు అప్పులు పెట్టాడు బటన్‌రెడ్డి. ఆర్థిక కష్టాలను అధిగమిస్తూనే.. ఒకవైపు సంపదసృష్టి మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది ఎన్డీయే సర్కారు. రాష్ట్ర ప్రగతి పారిశ్రామికాభివృద్ధితోనే సాధ్యమన్న దృక్పథంతో.. కేవలం ఆరు నెలల్లోనే రూ.4.6 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించింది చంద్రబాబు ప్రభుత్వం. ఈ విజయాలు చూడలేకే -ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఉపక్రమిస్తున్నాడు జగన్.

## ఆరోగ్యశ్రీ పేరిట జిమ్మిక్కులు

ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం 25 లక్షలకు పెంచామని డబ్బాలు కొట్టిన జగన్.. నెట్‌వర్క్ ఆసుపత్రులకు మాత్రం రూ.2500 కోట్ల పెండింగ్ పెట్టాడు. నిత్యావసర ధరలు, పన్నుల మోతతో రాష్ట్ర ప్రజల నడ్డివిరిచిన జగన్.. ఆరోగ్యాన్నీ గాలికొదిలేసి ప్రాణాలతో చెలగాటమాడాడు. కూటమి పాలన 4 నెలల్లోనే ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రూ.700 కోట్ల బకాయిలు చెల్లించింది. దీనిపైనా జగన్ రోత పత్రికలో నీచపు రాతలు రాయించుకున్నాడు.

విద్యుత్ భారం జగన్ చేతగానితనమే

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. మునుపటి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రద్దు చేసింది. కమీషన్ల కక్కుర్తితో ఓపెన్ మార్కెట్‌లో అత్యధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి.. ప్రజలపై రూ.6072.86 కోట్ల భారం మోపింది. జగన్ జమానాలో విద్యుత్ కొనుగోలులో ఎక్కడా పారదర్శకత కనిపించదు. విద్యుత్ వ్యవస్థను భ్రష్టుపట్టించడమే కాకుండా.. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. 2022-23 ఇంధన సర్దుబాటు భారం రూ.8114 కోట్లకుగాను 6,072 కోట్ల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించింది. అదే ఇప్పుడు జనం నెత్తిన గుదిబండగా మారింది.

## సహజ వనరుల దోపిడీ..

జగన్‌రెడ్డి మద్యం పాలసీ.. వైసీపీ దోపిడీకే ఉపయోగపడింది. మద్యం కంపెనీలను గుప్పిట పెట్టుకుని.. అస్మదీయులకే 90 శాతం ఆర్డర్లు ఇచ్చి రూ.3,100 కోట్లు కమీషన్లు దండుకున్నాడు. గత ఐదేళ్లు జగన్‌రెడ్డి పాలనలో జే ట్యాక్స్ విధించి రాష్ట్రంలోని మందుబాబుల ఇళ్లు, ఒళ్లు గుల్ల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జే ట్యాక్స్‌కు చెక్ పెట్టింది. బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపింది. మద్యం షాపుల కేటాయింపులో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన పారదర్శకత.. జగన్ జీర్ణించుకోలేకపోతున్నాడు. అలాగే, 2019లో ఉచిత ఇసుకను రద్దుచేసి భవన నిర్మాణ రంగాన్ని కుదేలుచేశాడు కంసమామ. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఇసుకాసురుల అవతారమెత్తి రాష్ట్ర ఖనిజ సంపదను ఇష్టారీతిన దోచుకుతిన్నారు. వైసీపీ ఇసుక బండారం బయటకు పొక్కడంతో, తప్పులను కప్పిపుచ్చేందుకు ఉచిత ఇసుకపై అబద్ధాలు మొదలెట్టాడు. వైసీపీ పాలనలో 10 టన్నుల ఇసుక రూ.15 వేలు ఉంటే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచితంగా ఇసుక లభిస్తోంది. ప్రజలు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, ఆటోలలో వచ్చి ఉచితంగా ఇసుకను తీసుకువెళుతున్నారు. ప్రజలపై సీనరేజ్ భారం కూడా ఉండకూడదని సీనరేజ్ ఫీజును సీఎం చంద్రబాబు రద్దు చేశారు. ఇవే జగన్‌కు కంటగింపు అవుతున్నాయి. వైసీపీ వైఫల్య ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజల విసిరికొట్టడంతో.. చంద్రబాబు పాలనపై అబద్ధాల ప్రచారానికి విధ్వంస పాలకుడు ప్రజల్లోకొచ్చే ప్రయత్నం చేస్తున్నాడు.

గద్దెనెక్కగానే -ఎన్డీయే ప్రభుత్వం పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచి 1నే ఇళ్ల వద్ద అందిస్తోంది. 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తోంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేసి, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రూపకల్పనతో ప్రజలు ఆస్తులకు రక్షణ కల్పించింది. దీపం-2 కింద కోటికి పైగా ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తోంది. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఉచిత ఇసుక సరఫరాతో 125 వృత్తులకు బతుకునిచ్చింది. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం సరఫరా చేస్తూ, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తోంది. జగన్ ధ్వంసం చేసి వదిలేసిన రోడ్లను మరమ్మతు చేస్తోంది. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతూ.. పర్యవేక్షణకు 'ఈగల్'ను ఏర్పాటు చేసింది. ఆరు నెలల్లో రూ.4.6 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలను ఆహ్వానిస్తోంది. 5లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. వీటిలో ఏది కాదని జగన్ ప్రచారం చేస్తాడు. తాను అధికారంలోకి వచ్చినపుడు.. మొదటి ఆరు నెలల్లో ఏం సాధించానని చెప్పుకుంటాడు. గత సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు పరువు తీసేసిన తరువాత.. అసలు ఏం ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తాడు? దీనికి జగన్ సమాధానం చెప్పాలి.

# స్టెల్లా షిప్‌లో అణువణువూ తనిఖీ

◆పౌరసరఫరాల మంత్రి మనోహర్ స్పష్టం



విశాఖ (చైతన్య రథం): బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటి వరకు 1,066 కేసులు నమోదు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు కోటి ఇరవై టన్నుల బియ్యం అక్రమ రవాణా జరిగిందన్నారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్.. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సూచించారు. విశాఖ కలెక్టరేట్లో ప్రాంతీయ పౌరసరఫరాల శాఖపై జరిగిన సమీక్షకు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

"ఉత్తరాంధ్రలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఒక్క ఉత్తరాంధ్రలోనే 1.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం. రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే నగదు జమ చేశాం. విశాఖ, కృష్ణపట్నం పోర్టుల కంటే రెండింతల బియ్యం కాకినాడ పోర్టు నుంచి తరలిపోయింది. కాకినాడ పోర్టు ద్వారా బియ్యం అక్రమ రవాణాలో కొందరు సీనియర్ అధికారుల పాత్ర ఉంది. విశాఖ పోర్టుపైనా దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించాం. కాకినాడు కలెక్టర్ అధ్వర్యంలో స్టెల్లా షిప్లో అణువణువూ తనిఖీ జరుగుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సీబీ సీఐడీ విచారణకు ఆదేశించాం. ఇప్పటివరకు 729 మందిని, 102 వాహనాలను సీజ్ చేశాం. అక్రమార్కులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం"అని నాదెండ్ల హెచ్చరించారు.

# ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో ఎంతో ప్రయోజనం

◆శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టీకరణ



శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల దేశం శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయ పడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాగోలులో గురువారం ప్రధానమంత్రి రోజ్‌ఘర్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది దేశంలోని చాలా ప్రాంతాలలో సంవత్సరంలో 6-8 నెలల పాటు లభించే సూర్యరశ్మిని గరిష్టంగా ఉపయోగించుకుంటుందని చెప్పారు. అయోధ్య ఆలయంలో శ్రీరాముని ప్రతిష్ఠాపన వేడుకల పవిత్రమైన రోజున, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన 2024ను ప్రకటించారని వివరించారు. ఈ పథకం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో సౌరశక్తి ఉపయోగించుకొని అనేక కార్యక్రమాలను నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం

◆ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పష్టీకరణ

◆అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

శృంగవరపుకోట (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తెలిపారు. ఎస్.కోట మండలం సీతంపేట గ్రామంలో గురువారం 5 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు సహా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి కష్టాలు తదితర సమస్యలను విని, పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కోట మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, కాళీ, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి వాసు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మంత్రి నాదెండ్లను కలిసిన మత్స్యకార నాయకులు

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుతో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గురువారం రాష్ట్ర మత్స్యకారుల నాయకులు, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ , ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, చింతకాయల సుజాత, ముత్యాలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చింతకాయల సూజాత ముత్యాలు అన్నారు . ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను ,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు , మెరిగి రాజు , తదితర నాయకులు పాల్గొన్నారు.



# విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్‌కు కూటమి ఎమ్మెల్యేల సన్మానం

విశాఖపట్నం (చైతన్యరథం): ఇటీవల విఎంఆర్‌డిఎ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.వి. ప్రణవ్ గోపాల్‌ను కూటమి పార్టీ ఎమ్మెల్యేలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎంఎల్‌ఏ పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎంఎల్‌ఏ విష్ణుకుమార్ రాజు, వెస్ట్ ఎంఎల్‌ఏ గణబాబు , సౌత్ ఎంఎల్‌ఏ వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు ఎంఎల్‌ఏ వెలగపూడి రామకృష్ణ బాబు పాల్గొన్నారు.

# సమగ్ర దర్యాప్తుతో ఆస్తి కేసులు త్వరితగతిన ఛేదించాలి

◆చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి

◆శ్రీకాకుళం ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి ఆదేశం

శ్రీకాకుళం (చైతన్యరథం): సమగ్రమైన దర్యాప్తుతో ఆస్తి కేసులు త్వరితగతిన ఛేధించి, రికవరీ చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు దిశ నిర్దేశం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వర్చువల్ ద్వార జిల్లా వ్యాప్తంగా డీఎస్పీలు, సిఐలు ,ఎస్సైలతో లోక్ అదాలత్ కేసులు, ఎస్సీ,ఎస్టీ , పోక్సో కేసులు, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, ప్రాపర్టీ, ఎన్ఫోర్స్మెంట్ కేసులపై సమీక్షించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిసెంబరు 14న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా ఇప్పటి




నుండే ప్రణాళికతో పని చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో లాస్ట్ ప్రాపర్టీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్ఫోర్స్మెంట్ కేసులు, మహిళలపై జరుగుతున్న దాడుల కేసులను, ప్రాపర్టీ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తు పెండింగులో ఉండుటకుగల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు పూర్తి చేయుటకు అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసి, ఎస్సీ ఎస్టీ మరియు పోక్సో కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎన్ఫోర్సుమెంటు కేసులను పెంచాలని,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, జూదం ఆడిన, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైనా కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ తోపాటు అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు, సిఐలు,ఎస్సైలు వారి వారి పోలీసు స్టేషన్లు, కార్యాలయాలు నుంచి పాల్గొన్నారు.

# రూ.5.65 లక్షల కోట్లతో 145 గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు

◆ కేంద్రమంత్రి హర్దీప్ సింగ్‌పురి వెల్లడి

◆ లోక్‌సభలో ఎంపీ పుట్టా ప్రశ్నకు సమాధానం



ఏలూరు, ( చైతన్యరథం) : కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు, అంత కంటే ఎక్కువ ఖర్చుతో రూ. 5.65 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 145 ప్రాజెక్టులను ఆమోదించిందని, వీటిలో రూ.2.84 లక్షల కోట్ల వ్యయంతో 78 కొత్త గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, రూ.2.81 లక్షల కోట్ల వ్యయంతో 67 బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నట్లు కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించారు.

దేశంలో ఆయిల్, నేచురల్ గ్యాస్ కంపెనీల ద్వారా గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు అనుమతులు, ప్రాజెక్టుల స్థాపనలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనీలను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి హర్దీప్ సింగ్ పూరి లిఖిత పూర్వకంగా బదులిచ్చారు.

గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత చమురు, గ్యాస్ కంపెనీ బోర్డులు నిర్ణయం తీసుకుంటాయని, తద్వారా ప్రభుత్వ పాత్ర సులభతరం చేశామని, గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు వాటి స్వభావాన్ని బట్టి పర్యావరణం, అటవీ, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ , వన్యప్రాణుల క్లియరెన్స్ తీసుకోవాలని, భూ సేకరణ, మార్గం హక్కు , వినియోగ హక్కు , పేలుడు, భద్రతకు సంబంధించిన అనుమతులు తీసుకోవాల్సి ఉందని మంత్రి సమాధానం ఇచ్చారు. 2014 నుండి రూ.4.86 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రూ.100 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయంతో మొత్తం 379 ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు. వీటిలో రూ.2.52 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 225 గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులు కాగా, రూ.2.34 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 154 బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు ఉన్నాయని మంత్రి తెలిపారు.

ప్రాజెక్ట్‌ల అమలు స్థితిని అంచనా వేయడానికి పటిష్టమైన ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్ కలిగి ఉందన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేయడం కోసం ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి బదులిచ్చారు.

## ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

◆ ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య స్పష్టీకరణ

ఏలూరు, ( చైతన్యరథం) : ప్రజాసమస్యల ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో గురువారం వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజలు ఏలాంటి సమస్యలున్న తనవద్దకే రావాలన్నారు. ఏ సమయంలైనా నేను అందుబాటులో ఉంటానని అన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ నెల 6వ తే దీ భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి దళిత సంఘాలనేతలు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



## ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

◆ ఉమ్మడి ఉభయ గోదావరిలో

92.62 శాతం పోలింగ్

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. 16737 మంది ఓటర్లకు గాను 15,502 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చారు. కాకినాడ జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాల్లో 3418 మంది ఓటర్లకు 3,118మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 91.22 శాతం నమోదైంది. తూర్పుగోదావరి 20 పోలింగ్ కేంద్రాల్లో 2,990 మంది ఓటర్లకు 2,753 మంది ఓటు వేశారు. 92.07శాతం పోలింగ్ నమోదైంది. డాక్టరు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాల్లో 3,296 ఓటర్లకు 3,138 మంది ఓటర్లు ఓటు వేశారు. 95.21 శాతం నమోదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 637 మంది ఓటర్లకు 565 మంది ఓటు వేశారు. పోలింగ్ శాతం 88.70. పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాల్లో 3,729 మంది ఓటర్లకు 3484 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 93.43 నమోదైంది. ఏలూరు జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాల్లో 2,667 మంది ఓటర్లకు 2,444 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 91.64 శాతం ఓటింగ్ నమోదైంది. కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 9న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది. అదే రోజు సాయంత్రానికి ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు.

**తాళ్లపూడిలో..**

జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు మధ్య పోలింగ్ ముగిసింది. 60 ఓట్లుగాను 56 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి పురుషులు 34, మహిళలు 22 మంది ఓటు వేశారు. దీంతో 93.33 శాతం పోలింగ్ నమోదైందని తహశీల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాణిసుష్మిత, పట్టణ సీఐ విశ్వం, ఎస్సై రామకృష్ణ పరిశీలించారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలకు సంకల్ప్-25

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి సంకల్ప్-25 కార్యక్రమాన్ని ఇంటర్ విద్యా మండలి రూపొందించింది. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ఏబీసీగా వర్గీకరించారు. అధ్యాపకులు, ఇతర సిబ్బందిని విద్యార్థులకు కేర్ టేకర్లుగా నియమించారు. దీనిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఉత్తర్వులు వెలువడటంతో ఆ దిశగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పలు కళాశాలలను పరిశీలించి అధ్యాపకులకు సూచనలిచ్చారు. విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రధానాచార్యులు టైం టేబుల్‌ను రూపొందిస్తున్నారు. పశ్చిగోదావరి జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3717మంది విద్యార్థులున్నారు.

అక్టోబరులో జరిగిన త్రైమాసిక పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలు గుర్తిస్తారు. చదువులో మెరుగ్గా ఉన్నవారిని గ్రూప్ 'ఎ'. అంతంత మాత్రంగా ఉంటేవి, తర్వాత ఉన్న వారిని 'సి' గా వర్గీకరించారు. వీరికి సులువు జవాబులు అర్థమయ్యేలా ప్రశ్నలతో ఉన్న పుస్తకాలు ఇస్తారు. ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు అధ్యయన తరగతులు ఉంటాయి.. అవసరమైతే 5 గంటల తర్వాత మరో అర్థగంట సమయాన్ని విద్యార్థులకు కేటాయిస్తారు. తరగతుల నిర్వహణ ఫోటోలు ఆన్లైన్లో పంపాలి. సంబంధిత అధికారులు వారానికి మూడుసార్లు కళాశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాల మెరుగు సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందించాలి.

గత ఏడాది జరిగిన పరీక్షల్లో జిల్లాలో 76.5 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది నూరుశాతం లక్ష్య సాధనకు ఇంటర్మీడియట్ విద్యా మండలి దృష్టి సారించింది. గతంతో పోల్చితే ఇటీవల కాలంలో కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు.

## తల్లిదండ్రులూ.. విద్యాపండగ పిలుస్తోంది

అమలాపురం: విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపర్చడానికి ఇవి దోహదం చేస్తాయి. ఈ నెల 7న పండగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సమావేశాలకు హాజరుకావాలని ఆయా పాఠశాలల తరఫున తల్లిదండ్రులను ఆహ్వానించడానికి విద్యార్థులే స్వయంగా రంగు రంగుల కాగితాలపై రాసిన పత్రాలను సిద్ధం చేశారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నచోట అచ్చువేసి ఇస్తున్నారు. వీటిని ఇళ్లకు పంపిస్తారు. గ్రామంలోని ప్రముఖులు, పెద్దలు, దాతలకు ఎస్ఎంసీ అధ్యక్షుల ద్వారా అందిస్తారు. పాఠశాలల వాట్సాప్ గ్రూపుల్లో డిజిటల్ ఆహ్వాన పత్రికలు పంపిస్తారు. విద్యాసంబంధమైన పలు అంశాలను, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించనున్నారు. కోనసీమ జిల్లాలో 1746 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 14,068 మంది విద్యార్థులు, 5835 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యనుబట్టి రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.5 వేల వరకు నిధులు మంజూరయ్యాయి, పదిమంది ఉంటే రూ. వెయ్యి. 11 నుంచి 25 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.1200, 26-50 మంది ఉంటే రూ.1600 చొప్పున అందాయి. 51-75 మందికి రూ.2 వేలు. 76-100కి రూ.2400, 101-200 మందికి రూ.3 వేలు, 201-300కి రూ.4 వేలు, 301-400 మంది ఉన్న పాఠశాలలకు రూ.5 వేల చొప్పున విడుదలయ్యాయి.

# పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- తీరప్రాంత మత్స్యకారులు, గిరిజనులకు అండగా ఉంటాం
- ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి
- పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే పాశం సూనీల్
- ఇంటర్ ఫేస్ మీటింగ్ విత్ కోస్టల్ కమ్యూనిటీస్‌తో ఎన్జీవో ఏఆర్డీ సమావేశం





గూడూరు, (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పర్యావరణ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించారని ఆ మేరకు ఫలితాలు సాధించి తీర ప్రాంతంలోని మత్స్యకారులు, గిరిజ నులకు అండగా ఉంటామని ఎన్విరాన్మెంట్ మేనే జ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగానే తనకు బాధ్యత అప్పగిం చారని అన్నారు. యువగళం అధినేత మంత్రి లోకేష్ ఆలోచన మేరకు పర్యావరణ పరిరక్షణ ఒక బాధ్యతగా పనిచేస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి నా వంతు కృషి చేస్తానని అని అన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఏఆర్డీ చైర్మన్‌బషీర్ కు అభినందనలు తెలిపారు. సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని మన ప్రాంతంలో చాలా మంది గిరిజనులు, మత్స్యకారులు తీర ప్రాంత చెరువులు సరస్సులు మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వారి జీవన విధానం ఇంకా మెరుగ్గా ఉండటానికి ప్రభుత్వం అన్ని రకాలుగా పని చేస్తుందని తెలిపారు. తీరంలోని పరిశ్రమలు, గనుల నుంచి వచ్చే వ్యర్థాలు సంద్రంలో నదుల్లో చెరువుల్లో కలవడం వల్ల మత్స్య సంపద మాత్రమే కాకుండా దాని మీద అధార పడి జీవిస్తున్న యానాదులు, గిరిజనులు, మత్స్యకారుల జీవితాల మీద ప్రభావం చూపుతోంద న్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఇందులో భాగంగానే ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందని వివరించారు. తాము పరిశ్రమల వ్యర్థాలతో పర్యావరణానికి నష్టం కలిగించే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాటిని ఎలా నిర్వీర్యం చేయాలో దానికోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే విషయంలో అన్ని రకాలుగా ముఖ్యమంత్రితో చర్చించి తగు జాగ్రత్తలు తీసుకుంటా మని తెలిపారు. తొలిసారిగా ఏఆర్డీ సంస్థ ముందుకు వచ్చి గిరిజనులు మత్స్యకారుల సమస్యలు తమ దృష్టికి తెచ్చిందన్నారు. ఆ వివరాలతో తమ పని ఇక్కడ నుంచే ప్రారంభిస్తున్నామన్నారు. పని చేసేవారికి అన్ని రకాలుగా సహకరిస్తానన్నారు. గిరిజనుల జీవనోపాధికి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన విధానాలు ముఖ్య మంత్రితో చర్చించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు పోయి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు శాసన సభ్యుడు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### వైసీపీ హయాంలో

# నిరుద్యోగులు భారీగా నష్టపోయారు



- కూటమి ప్రభుత్వంతో యువతకు మహర్దశ
- కుప్పంలో మెగా జాబ్ మేళా
- ముఖ్యతిథిగా ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ మునిరత్నం

కుప్పం (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు గత ప్రభుత్వంలో భారీగా నష్టపోయారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు కుప్పం నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెట్టారన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గడచిన ఐదు సంవత్సరాలు నిరుద్యోగులు ఎంతగానో నష్టపోయారని అన్నారు. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన ఐదు నెలల్లో శ్రీ సిటీకి 15 నూతన కంపెనీలు వచ్చాయని, కుప్పంలో 40 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడిపి నేతలు, నిరుద్యోగ యువత అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతి ఇంట్లో ఆత్మీయత.. ఆప్యాయత

- భారీ మెజారిటీతో బాధ్యత పెరిగింది
- ప్రజల కోసం ప్రజలతోనే ఉంటాం
- టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): జరిగిన ఎన్నికల్లో తన సోదరుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా తమ కుటుంబంపై బాధ్యత మరింత పెరిగిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ ముత్యాల పాలెం, రామలింగాపురంలో రెండో రోజు ప్రారంభమైన గడపగడపకూ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. నిత్యం ప్రజల కోసం ప్రజల్లోనే ఉంటామని ఆయన నిరూపించుకుంటున్నారు.

## రెవిన్యూ సదస్సులతో భూమి సమస్యల పరిష్కారం



మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం పట్టణం లోని కలెక్టర్ కార్యాలయం ప్రకాశం భవన్‌లో జరిగిన రెవిన్యూ సదస్సుల సన్నద్ధతా సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ గారు తమిమ్ అన్సారీయా, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు ,అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

*- రాయచోటి టీడీపీ నేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి*



రాయచోటి, (చైతన్యరథం): రాయచోటి నియోజక వర్గంలో భూ సమ స్యల శాశ్వత పరిష్కా రానికి చర్యలు చేపడుతున్నామని రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి సంబంధిత ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కరించేందుకు పలు గ్రామాలలో నూతన బోర్లు వేసి గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామంలో బోరు వేసి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడతామన్నారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- టీడీపీ శ్రేణులతో, ఎమ్మెల్యే ముత్తుముల భేటీ



గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని శ్రీ చీతిరాల కళ్యాణ మండపంలో గురువారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అర్ధవీడు, కంభం మండలాల నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామ పంచాయతీలలోని నాయకులు కార్యకర్తలతో భేటీ అయ్యి గ్రామంలోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరగవలసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో జరిగిన నష్టాన్ని అధిగమించి గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన దిశగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోందని, గ్రామాల్లో ప్రతి టీడీపీ కార్యకర్త గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకొని రావాలని, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు, కంభం మండల పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొలువుదీరిన మహా సర్కార్

## ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం

ముంబై: ఎట్టకేలకు మహారాష్ట్రలో 'మహాయుతి' సర్కార్ కొలువుదీరింది. ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. పలువురి పేర్లు తెరమీదకు రావడం ఉత్కంఠ రేపింది. ఈ నేపథ్యంలో ముంబయిలో బుధవారం నిర్వహించిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడ్నవీస్ పేరును ఖరారు చేయడంతో ఉత్కంఠకు తెరపడింది. మొత్తమ్మీద మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఫడ్నవీస్‌తోపాటు డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ కూడా ప్రమాణం చేశారు. వారితో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు. ముంబయిలోని ఆజాద్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్ చౌహాన్, రాందాస్ అథవాలే, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ సీఎం నితీశ్ కుమార్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల నుంచి 19 మంది ముఖ్యమంత్రులు హాజరయ్యారు.



అలాగే వ్యాపారవేత్త ముఖేశ్ అంబానీ, మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్-అంజలి దంపతులు, బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, రణబీర్ కపూర్, రణవీర్‌సింగ్ సహా ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

దేవేంద్ర ఫడ్నవీస్ సీఎంగా మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్ తండ్రి గంగాధర్ ఫడ్నవీస్ జనసంఘ్, బీజేపీలో చురుగ్గా పని చేశారు. 1989లో ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించిన ఫడ్నవీస్ 22 ఏళ్ల వయసులోనే నాగ్‌పూర్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1997లో 27 ఏళ్లకే మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1999 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన ఆయన.. 2014లో మొదటిసారి మహారాష్ట్ర సీఎంగా ఎన్నికయ్యారు. 2019 నవంబర్ 23న రెండోసారి సీఎంగా ప్రమాణం చేశారు. అయితే సరిపడా శాసనసభ్యుల బలం లేకపోవడంతో మూడు రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది. 2022 జూన్‌లో శివసేనలో షిండే తిరుగుబాటు చేసి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. షిండే కేబినెట్‌లో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఇటీవలే జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించింది. కూటమిలోని బీజేపీ 132 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. షిండే శివసేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి.

## సీఎంఆర్‌ఎఫ్ ఫైలుపై సీఎం ఫడ్నవీస్ తొలి సంతకం

ముంబయి: మహారాష్ట్రలో నూతన ప్రభుత్వం కొలువు దీరింది. ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. అయితే, సీఎం బాధ్యతలు తీసుకున్న ఫడ్నవీస్... తొలి సంతకం ఒక రోగికి ఆర్థిక సాయం అందించే దస్త్రంపై చేశారు. పుణెకు చెందిన చంద్రకాంత్ అనే వ్యక్తి బోన్ మ్యారో మార్పిడి చికిత్స కోసం ఎదురుచూస్తున్నాడు. అందుకు అతడి భార్య సీఎం సహాయ నిధుల నుంచి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో బాధితుడికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందించే దస్త్రంపై తొలి సంతకం చేశారు.

రానున్న ఐదేళ్లలో ప్రజలకు స్థిరమైన పాలన అందిస్తామని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. తన సారథ్యంలో కొలువుదీరిన ప్రభుత్వంలో ప్రజలు రాజకీయ మార్పును చూస్తారు తప్ప ప్రతీకారాన్ని కాదన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు వారి ఆకాంక్షలు, ప్రేమకు అద్దంపడుతున్నాయన్నారు. సామాజిక, మౌలిక, పారిశ్రామిక రంగాల్లో ఇదే వేగంతో మహారాష్ట్రను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. "డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం. 9న స్పీకర్ ఎన్నిక చేపడతాం. గత రెండున్నరేళ్లలో మహారాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేశాం. ఇప్పుడూ అలాగే కృషిచేస్తాం. మా డైరెక్షన్, స్పీడ్ అలాగే ఉంటుంది. మ్యానిఫెస్టోలో ఇచ్చిన మేరకు హామీలు పూర్తి చేస్తాం. ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరిగిందని నేను భావించడంలేదు. 2004లో కూడా 12 -13 రోజుల పాటు ఆలస్యం జరిగింది. 2009లో తొమ్మిది రోజులు ఆలస్యమైంది. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇందుకోసం పెద్దఎత్తున సంప్రదింపులు జరగాల్సి ఉంటుంది కదా. మంత్రి పదవులను దాదాపు ఖరారు చేశాం. ఇంకా కొంత మిగిలి ఉంది. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ నాతో ఉన్నారు. క్యాబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపుపై మేం చర్చించి నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వంలో మంత్రుల పనితీరు ఆధారంగానే తదుపరి నిర్ణయం తీసుకుంటాం" అని ఫడ్నవీస్ వివరించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం చర్యలు

◆ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ ఘటనలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నా ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తానూ కూడా బాధితుడినేని చెప్పారు. చట్టాలంటే ప్రజలకు భయం లేదన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై గురువారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు నితిన్ గడ్కరీ బదులిచ్చారు. "ఇక్కడ నాలుగు అంశాలు కీలకమైనవి.. రోడ్డు ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సమర్థంగా చట్టాల అమలు, ప్రజలకు అవగాహన కల్పించడం. ఇక్కడ సమస్య ఏంటంటే.. చట్టాలంటే ప్రజలకు భయం గానీ, గౌరవంగానీ లేవు. రెడ్ సిగ్నల్ పడితే ఆగరు. హెల్మెట్ పెట్టుకోరు. నిన్నటికి నిన్న నా కళ్లముందే ఓ కారు రెడ్ సిగ్నల్ దాటుకుని వెళ్లిపోయింది. హెల్మెట్ ధరించని కారణంగా ఏటా కనీసం 30వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి" అని గడ్కరి వివరించారు.

"నేను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినే. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నాకు యాక్సిడెంట్ అయి కాలు విరిగింది. అందుకే ఈ అంశం నాకు చాలా సున్నితమైంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎంత కష్టపడుతున్నా.. ఏటా 168 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. చట్టాల అమలు సరిగ్గా లేకపోవడమే దీనికి కారణం. ప్రజాప్రతినిధులు, మీడియా, సమాజం నుంచి సహకారం లేకుండా వీటిని తగ్గించడం సాధ్యం కాదు. జరిమానాలు పెంచినా ప్రజలు రూల్స్ పాటించట్లేదు" అని కేంద్రమంత్రి తెలిపారు. దీనిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ పెట్టాలని ఈ సందర్భంగా గడ్కరీ స్పీకర్‌ను కోరారు.

### ఢిల్లీలో మెరుగుపడ్డ గాలి నాణ్యత

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు కాలుష్యం మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 165గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 178, ఛాందినీ చౌక్ వద్ద 194, ఐటీవో ప్రాంతంలో 130, వాజీపూర్‌లో 152, ఓఖ్లా ఫేజ్-2 వద్ద 147, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 145, పట్పర్గంజ్‌లో 164, అయా నగర్‌లో 107, లోధి రోడ్డులో 128, ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 162, పంజాబీ భాగ్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 152గా నమోదైంది.

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్‌ఎల్వీ-సీ59 రాకెట్



శ్రీహరికోట: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్‌ఎల్వీ-సీ59 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ప్రోబా-3 ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లింది. కృత్రిమ సూర్యగ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను నింగిలోకి పంపింది. కాగా, ఈ ప్రయోగం బుధవారంనాడు చేపట్టాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో ప్రోబా-3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గురువారం ఈ ప్రయోగాన్ని చేపట్టారు.

ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ప్రోబా-3ని ప్రయోగించింది. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, అక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

ప్రోబా-3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి అల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా-3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించారు. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండా పోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



## హేమంత్ సోరెన్ కేబినెట్ విస్తరణ

◆ 11 మంది మంత్రుల ప్రమాణస్వీకారం

రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ గత వారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన తన మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా 11 మందికి చోటు కల్పించారు. రాంచీలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులచే గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు.

జేఎంఎం ఎమ్మెల్యేలు దీపక్ బిరువా, చమ్రా లిండా, రాందాస్ సోరెన్, హఫీజుల్ హసన్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాధా కృష్ణ కిషోర్, ఇర్ఫాన్ అన్సారీ, ఆర్జేడీ ఎమ్మెల్యే సంజయ్ ప్రసాద్ యాదవ్ తదితరులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా జేఎంఎం ఎమ్మెల్యే స్టీఫెన్ మరాండీ ప్రమాణం చేశారు.

# ఐడియా ఇస్తే రూ.16 లక్షలు

## లూనార్ రెస్క్యూ సిస్టంపై నాసా ఆఫర్




అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ త్వరలోనే చంద్రుడిపైకి యాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఇందుకోసం నాసా తమ ప్రణాళికలను మరింత ముమ్మరం చేసింది. ఇందులోభాగంగానే లూనార్ రెస్క్యూ సిస్టంను అభివృద్ధిచేస్తే 20వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.16లక్షలకు పైమాటే) నజరానా ఇస్తామని ఆఫర్ ప్రకటించింది. చంద్రుడిపై ఒకవేళ వ్యోమగాములు చిక్కుకున్న పరిస్థితుల్లో వారు జాబిల్లిపై సురక్షితంగా తిరిగేలా సమర్థవంతమైన డిజైన్లు ఇవ్వాలని ఆహ్వానించింది. వచ్చే ఏడాది జనవరి 23లోపు ఔత్సాహికులు తమ ఐడియాలను హీరో ఎక్స్ పోర్టల్లో సమర్పించాలని నాసా వెల్లడించింది. చంద్రుడి ఉపరితలంపైకి వెళ్లిన తర్వాత గాయం, మెడికల్ ఎమర్జెన్సీ, మిషన్ సంబంధిత ప్రమాదాలు చోటుచేసుకుంటే వ్యోమగాములు అచేతన స్థితికి వెళ్లే అవకాశం ఉంది. అప్పుడు తోటి క్రూ సిబ్బంది వారిని లూనార్ ల్యాండర్ వద్దకు తిరిగి పంపాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్పేస్ సూట్ ధరించిన వ్యోమగాములను రోవర్ లేకుండా రెండు కిలోమీటర్ల మేర కదిలించేలా డిజైన్ రూపొందించాలని నాసా పేర్కొంది. సాధారణంగా జాబిల్లి ఉపరితలంపై గురుత్వాకర్షణ తక్కువగా ఉండటంతో వ్యోమగాముల శరీర బరువు తేలికవుతుంది. అయినప్పటికీ వారిని సాధారణ స్థితిలో ఒకచోటు నుంచి ఇంకొకచోటుకు తరలించడం కష్టమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే నాసా సాంకేతిక పరిష్కారంపై దృష్టి పెట్టింది. చంద్రుడిపైకి మళ్లీ మనిషిని పంపేందుకుగానూ నాసా ఓ మిషన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులోభాగంగానే రెండేళ్ల క్రితం ఆర్టెమిస్-1 (మానవ రహిత) ప్రయోగం చేపట్టింది. తర్వాత 2025లో ఆర్టెమిస్-2ను, 2026లో మానవసహిత ఆర్టెమిస్-3 ప్రయోగం చేపట్టనుంది.

# ఎమర్జెన్సీ ప్రకటన.. డీప్ ఫేక్ అనుకున్నా!

## ద.కొరియా ప్రతిపక్ష నేత లీజే



దక్షిణ కొరియాలో మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ చేసిన ప్రకటనను తాను డీప్ ఫేక్‌గా భ్రమించినట్లు ప్రతిపక్ష లిబరల్ డెమోక్రటిక్ పార్టీ నేత లీజే మ్యుంగ్ పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. నాటి ఘటనపై మ్యుంగ్ మాట్లాడుతూ 'ఆ రోజు విధులు ముగించుకొని నా ఇంట్లో పడుకొని ఉండగా.. హఠాత్తుగా నా భార్య ఒక యూట్యూబ్ వీడియో చూపిస్తూ.. 'అధ్యక్షుడు మార్షల్ లా విధించారు' అని చెప్పింది. నేను దానిని పట్టించుకోకుండా.. అది డీప్ ఫేక్ అయి ఉంటుందని చెప్పాను. కానీ, అది నిజం. అయినా నా మనసులో మాత్రం అది కల్పిత వీడియో అనే అనుకొన్నాను' అని తన అనుభవాన్ని వెల్లడించాడు. లీజే మ్యుంగ్ 2022 నుంచి ప్రతిపక్షంలో ఉన్నారు.

ఎమర్జెన్సీ విషయం తెలిసిన గంటలోనే లీజే పార్లమెంట్‌కు బయల్దేరారు. వెంటనే తీర్మానం చేసేందుకు వీలుగా.. పార్టీ సభ్యులను తక్షణమే అక్కడి రావాలని టెలిగ్రామ్ గ్రూప్‌లో పిలుపునిచ్చారు. కానీ, ఆయన పార్లమెంట్ వద్దకు చేరే సమయానికే భారీగా సైనిక దళాలు అక్కడ పహారా ఉన్నాయి. ఎవరినీ లోపలికి వెళ్లనీయడంలేదు. ఎట్టకేలకు కంచెను దూకి ఆయన పార్లమెంట్లోకి ప్రవేశించారు. ఆ దృశ్యాలు లైవ్ స్ట్రీమ్ కావడంతో లక్షలమంది వీక్షించారు. అధికార, ప్రతిపక్షాలకు చెందిన దాదాపు 180మంది సభ్యులు కూడా లోపలకు చేరుకొన్నారు. వారు అధ్యక్షుడి ఆదేశాలను తిరస్కరిస్తూ తీర్మానం చేశారు. దీంతో ఎట్టకేలకు యూన్ సుక్ యోల్ మార్షల్ లా ఆదేశాలను వాపస్ తీసుకొన్నారు. మార్షల్ ఆదేశాలకు మద్దతు పలికిన రక్షణ మంత్రి పదవి కోల్పోయారు. తాజాగా అధ్యక్షుడు యూన్ సుక్‌పై పోలీసు దర్యాప్తు చేపట్టనున్నారు. పలువురు మిలటరీ ఆఫీసర్లపై కూడా విచారణ మొదలైంది. వీరిలో కొందరికి మార్షల్ లా ప్లాన్ గురించి ముందే సమాచారం ఉన్నట్లు తెలిసింది.

# ఇజ్రాయెల్ డ్రోన్ల నుంచి పిల్లల ఏడుపు శబ్దాలు!?

## పాలస్తీనీయులను బయటకు రప్పించే వ్యూహం



ఇజ్రాయెల్ దాడులతో అస్తవ్యస్తమైన గాజాలో కల్లోల పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. వేలాది భవనాలు నేలమట్టమవడంతో ఉండటానికి నిలువనీడ లేక ఎంతోమంది పాలస్తీనావాసులు శిబిరాల్లో తల దాచుకుంటున్నారు. గాజాలో పౌరుల దుస్థితిపై ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచవ్యాప్తంగా మానవహక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. గాజాపై ఇజ్రాయెల్ ప్రయోగిస్తున్న డ్రోన్లనుంచి చిన్న పిల్లల ఏడుపు శబ్దాలు వినిపిస్తున్నాయట. పాలస్తీనీయులను బయటకు రప్పించి దాడులు చేయడం కోసమే ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నారని యూరో-మిడ్ హ్యూమన్ రైట్స్ మానిటర్ మాహా హుస్సేని ఆరోపించారు. ఈమేరకు ఆమె ఓఅంతర్జాతీయ మీడియా సంస్థకు వెల్లడించారు. "ఇజ్రాయెల్‌కు చెందిన క్వాడ్‌కాప్టర్ల డ్రోన్ల నుంచి వింత శబ్దాలు వినిపిస్తున్నాయని ఏప్రిల్ మధ్యలో మాకు సమాచారం అందింది. వాటిల్లో నుంచి చిన్న పిల్లల ఏడుపు శబ్దాలు, మహిళల ఆర్తనాదాల వంటివి వినిపిస్తున్నాయని కొంత మంది చెప్పారు. దీంతో నేను వ్యక్తిగతంగా నుసెరాయిత్‌లో పర్యటించి చాలామంది పాలస్తీనీయులతో వేర్వేరుగా మాట్లాడి దీని గురించి సాక్ష్యాధారాలతో తెలుసుకున్నా"అని మాహా వెల్లడించారు.

ఈ శబ్దాలతో పాలస్తీనీయులను శిబిరాల నుంచి బయటకు రప్పించి వారిపై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ ఈ చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ఏడుపు శబ్దాలు, అరుపులు విని సాయం చేసేందుకు వెళ్లిన చాలా మంది దాడుల్లో గాయపడ్డారని తెలిపారు. వెస్ట్ బ్యాంకులోని ఖాన్ యూనిస్‌లోనూ ఈతరహా ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. 'నాకు అమ్మ కావాలి' అని చిన్నారులు ఏడుపు శబ్దాలతో డ్రోన్లను ప్రయోగించి దాడులు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

గతేడాది అక్టోబరు 7తర్వాత గాజాపై దాడులు మొదలు పెట్టిన నాటినుంచి ఇజ్రాయెల్ ఈ రిమోట్ కంట్రోల్ ఆధారిత క్వాడ్‌కాప్టర్లను విరివిగా ఉపయోగిస్తోంది. నిఘా పెట్టడం, మూకను చెదరగొట్టడం వంటివి డ్రోన్లతో చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో గాజాలో ఆహారం కోసం ఎగబడిన వందలమంది పౌరులపైనా ఈ డ్రోన్లతోనే కాల్పులు జరిపినట్లు అప్పట్లో కథనాలు వచ్చాయి. తాజాగా వీటికి సౌండ్ వ్యవస్థను అమర్చినట్లు తెలుస్తోంది. హిబ్రూ, అరబిక్ బాషల్లో ఈ శబ్దాలు వస్తున్నాయట.



# బంగ్లా జైళ్లనుంచి 700మంది ఉగ్రవాదులు, హంతకుల పరారీ

## విద్యార్థి ఉద్యమ ఫలితం..

బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమం సమయంలో జైళ్లను బద్దలు కొట్టడంతో పెద్ద సంఖ్యలో కరుడుగట్టిన ఉగ్రవాదులు, ఉరిశిక్ష పడిన హంతకులు పరారయ్యారు. వారిలో 700మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. ఈవిషయాన్ని ఆ దేశ అధికారులే బుధవారం వెల్లడించారు. నాటి ప్రధాని షేక్ హసీనాపై తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఆందోళనల్లో దేశవ్యాప్తంగా 2,200 మంది ఖైదీలు తప్పించుకొన్నారు. ఈ విషయాన్ని జైళ్ల శాఖ చీఫ్ సయీద్ మహమ్మద్ మోతెర్ హొసైన్ ధ్రువీకరించారు. వీరిలో దాదాపు 1500 మందిని భద్రతా దళాలు తిరిగి అదుపులోకి తీసుకొన్నాయని పేర్కొన్నారు. పరారీలో ఉన్న 700మంది ఖైదీల్లో 70మంది వరకు కరుడుగట్టిన ఉగ్రవాదులు, ఉరిశిక్షపడిన ఖైదీలున్నట్లు వెల్లడించారు. జులై 19న అల్లర్ల సందర్భంగా ఢాకా నగరానికి తూర్పున ఉన్న నార్సింగిలోని జైలుపై వందలమంది దాడి చేసి నిప్పుపెట్టారు. అనంతరం పెద్దసంఖ్యలో ఖైదీలను విడిపించారు. ఆ తర్వాత వారాల్లో మరో నాలుగు జైళ్లపై కూడా దాడులు జరిగాయి. వీటిల్లో కరుడుగట్టిన నేరస్థులను ఉంచే కిషిమ్‌పూర్ జైలు కూడా ఉంది. పోలీసుశాఖ ప్రతినిధి ఇమామ్ హొసైన్ సాగర్ మాట్లాడుతూ పరారీలో ఉన్న ఖైదీల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే వీరి సమాచారం దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపామన్నారు. ప్రధాని హసీనా దేశం వీడిన తర్వాత బెయిలు పొందిన ఉగ్రవాదులపై కూడా తమ నిఘా ఉందని చెప్పారు.

# నాసా చీఫ్‌గా ఐజాక్‌మెన్

## మస్క్ బిజినెస్ ఫ్రెండ్‌ని ప్రకటించిన ట్రంప్



అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ తన పాలకవర్గంలో నియామకాల జోరు కొనసాగిస్తున్నారు. తాజాగా అగ్రరాజ్య అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తదుపరి చీఫ్‌గా బిలియనీర్, ప్రైవేట్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మెన్‌ను నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈయన స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాపార సహచరుడు కావడంతో ఈ ఎంపిక చర్చనీయాంశంగా మారింది. "వ్యాపారవేత్త, దాత, పైలట్, వ్యోమగామి అయిన జేర్డ్ ఐజాక్‌మెన్‌ను నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) అడ్మినిస్ట్రేటర్‌గా నామినేట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన నాయకత్వంలో నాసా మిషన్ మరింత పురోగతి సాధిస్తుంది. స్పేస్ సైన్స్, టెక్నాలజీలో సరికొత్త లక్ష్యాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నా" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో రాసుకొచ్చారు.

### ఎవరీ జేర్డ్ ఐజాక్‌మెన్..?

'షిఫ్ట్4 పేమెంట్స్' కంపెనీ సీఈవోగా ఉన్న 41ఏళ్ల ఐజాక్‌మెన్.. తన 16వ ఏటనే కంపెనీని ప్రారంభించారు. ప్రభుత్వం, రాజకీయాలతో పెద్దగా పరిచయాలులేని ఆయనకు రెండుసార్లు అంతరిక్షంలోకి వెళ్లిన అనుభవం ఉంది. అంతరిక్షంలో స్పేస్‌వాక్ చేసిన తొలి ప్రైవేట్ వ్యోమగామిగా గుర్తింపు సాధించారు. ఈ ఏడాది సెప్టెంబరులో స్పేస్‌ఎక్స్ సంస్థ 'పొలారిస్ డాన్' ప్రాజెక్టు కింద ఫాల్కన్-9 రాకెట్లో నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. వారిలో ఒకరైన ఐజాక్‌మెన్ క్యాప్సుల్‌నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ చేశారు. ప్రొఫెషనల్ వ్యోమగాములు కాకుండా.. అంతరిక్షంలో స్పేస్‌వాక్ నిర్వహించిన తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఇక, స్పేస్ ఎక్స్ కార్యకలాపాల్లోనూ ఐజాక్‌మెన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. 2021లో ఈకంపెనీ చేపట్టిన ఇన్స్పిరేషన్ 4 ఆర్బిటల్ మిషన్‌కు ఈయన సొంతంగా 200మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు కమాండర్‌గానూ వ్యవహరించి తొలిసారి అంతరిక్షంలోకి వెళ్లొచ్చారు.